క్లుప్తంగా

నేడు ఉచిత మెగా హెల్త్ క్యాంపు

గౌలిపురా: ఈనెల 9న కేంద్ర మాజీ మంత్రి ఆలే నరేంద్ర వర్ధంతిని పురస్కరించుకొని ఉచిత మెగా హెల్త్ క్యాంపును నిర్వహించనున్నట్లు మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర తెలిపారు. గౌలిపురా మేకలమండిలోని ఓంకార్ ప్లే గ్రౌండ్‌లో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహించనున్నామన్నారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జ్యోతిరావు పూలే జయంతి కన్వీనర్‌గా ముఖేష్ ముదిరాజ్



అబిడ్స్: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకల కన్వీనర్‌గా గోషామహల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ముఖేష్ ముదిరాజ్ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ బీసీ వెల్ఫేర్ శాఖ అడిషనల్ ప్రైవేట్ సెక్రటరీ సీహెచ్. వెంకటేశ్వర్‌రావు ఆయనను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ముఖేష్ ముదిరాజ్ మాట్లాడుతూ.. 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు పెద్ద ఎత్తున చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు.

ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న పంకజ్‌కుమార్ అగర్వాల్

చార్మినార్: కుంభమేళా అగర్వాల్ బంధు, అశోక్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పంకజ్‌కుమార్ అగర్వాల్ ఆధ్వర్యంలో శనివారం హనుమంతుని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులే కాకుండా నగరంలోని ఇతర ప్రాంతాలకు చెందిన హనుమాన్ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

సుల్తాన్‌బజార్: ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ వస్తున్న క్రమంలో ముందు జాగ్రత్తలో భాగంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మునిరాతి అరుణ్‌కుమార్‌ను స్థానిక పోలీసులు అరెస్టు చేసి అనంతరం సొంత పూచికత్తుకపై విడుదల చేశారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. బీజేపీ ఎస్సీ వర్గీకరణకు అనుకూలమని చెబుతూనే దానిని తాస్కారం చేస్తున్నాడని ఆయన మండిపడ్డారు. పార్లమెంటులో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

సత్తా చాటిన రవీంద్రభారతి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న డీన్ ప్రియామనీష్, నూరీన్ పాతీమాలు

విజయనగర్‌కాలనీ: నేషనల్ ఒలంపియార్డ్ ట్యాలెంట్ టెస్టు పోటీలలో విజయనగర్‌కాలనీ రవీంద్రభారతి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 1వ తరగతి చదువుతున్న విద్యార్థి మహ్మద్ ఆహీల్ ఆరీఫ్ ఉద్దీన్ 2వ ర్యాంకు సాధించగా, మరో విద్యార్థి బోదన్ జిల్లా ర్యాంక్ సాధించాడు. ఈ మేరకు శనివారం పాఠశాలలో రవీంద్రభారతి విద్యాసంస్థల డీన్ ప్రియామనీష్, ప్రిన్సిపాల్ నూరీన్ పాతీమాలు విద్యార్థులకు బహుమతులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జ్ మధు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బ్రేక్‌లు ఫెయిలై పాన్‌షాప్‌లోకి దూసుకెళ్లిన కారు

ఇద్దరికి గాయాలు

చాంద్రాయణగుట్ట: బ్రేక్‌లు ఫెయిలైన కారు పాన్‌షాప్‌లోకి దూసుకెళ్లిన ఘటన చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్ట నుంచి సంతోష్‌నగర్ వైపు వెళుతున్న కారు బాబానగర్ వద్దకు రాగానే ఒక్కసారిగా బ్రేక్‌లు ఫెయిలై రోడ్డు పక్కన ఉన్న మొఘల్ పాన్ మహల్‌లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో పాన్‌షాప్‌లో పనిచేసే మహ్మద్ ఖాజా, వినియోగదారుడు అన్వర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

మోదీ సభకు తరలిన బీజేపీ శ్రేణులు



కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యాలయ కో ఆర్డినేటర్ గోపాల్‌జీ, జిగ్నేష్ జోషి



స్వాగతం పలికిన కొల్లూరి పవన్‌కుమార్ తదితరులు



మోదీ బహిరంగ సభకు బయలుదేరిన బీజేపీ నాయకులు



బీజేపీ నాయకులతో దేవర శ్రీనివాస్ తదితరులు



మోదీకి అభివాదం చేస్తున్న బీజేపీ నాయకుడు అమర్ సింగ్

అబిడ్స్: కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రగతి, సంక్షేమం, అభివృద్ధితో ప్రజల్లో బీజేపీకి తిరుగులేని ఆదరణ లభిస్తుండడంతో బీఆర్‌ఎస్ జీర్ణించుకోలేక పోతుందని రాష్ట్ర బీజేపీ కార్యాలయ కో ఆర్డినేటర్ గోపాల్‌జీ పేర్కొన్నారు. గోషామహల్ నుంచి భారీ ఎత్తున కార్యకర్తలు, నాయకులతో కలిసి అబిడ్స్, బషీర్‌బాగ్ మీదుగా సికింద్రాబాద్‌లోని మోదీ బహిరంగ సభకు భారీ ఎత్తున నాయకులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో జిగ్నేష్ జోషి, ఆల్కాజీ, హరిహరి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మోదీని కలిసిన అమర్‌సింగ్..

గోల్కొండ: నరేంద్ర మోదీని బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అమర్ సింగ్ శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మోదీకి అభివాదం చేశారు. అమర్ సింగ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీని కలవడం తమలో నూతన ఉత్సాహం వచ్చిందన్నారు. ఈ సారి కార్వాన్ నియోజకవర్గాన్ని ఎలాగైనా కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

'తెలంగాణ లీకేజీల రాష్ట్రం'..

గోల్కొండ: తెలంగాణ రాష్ట్రం కాస్త లీకేజీల రాష్ట్రంగా మారిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. శనివారం గుడిమల్కాపూర్ తాళ్లగడ్డ చౌరస్తా వద్ద బీజేపీ నాయకుల సమావేశం జరిగింది. ప్రధాని మోదీ రాష్ట్రానికి వచ్చిన సందర్భంగా బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ. మొదటి విడత సంగ్రామ యాత్రతో బీఆర్‌ఎస్ పతనం ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణయాదవ్, అశ్విన్, నామా యాదగిరి తదితరులున్నారు.

ప్రధాని మోదీకి స్వాగతం..

అబిడ్స్: నగరానికి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి నాంపల్లి నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ కొల్లూరి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. నాంపల్లి నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలను, నాయకులను ప్రధాని మోదీ సభకు కొల్లూరి పవన్‌కుమార్ ప్రదర్శనగా తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ హయాంలో ప్రపంచంలోనే భారత్ నెంబర్-1 స్థాయిలో ఉందన్నారు.

చార్మినార్ నియోజకవర్గం నుంచి..

చార్మినార్: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభకు పాతబస్తీ చార్మినార్ నియోజకవర్గం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు శనివారం పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేంద్ర, కన్వీనర్ సురేందర్, నాయకులు నరేందర్, కునాల్‌రావు, ప్రవీణ్ బాగ్డీ, ప్రకాశ్‌గౌడ్, వికాస్, కిరణ్, ముఖేశ్, రాహుల్‌యాదవ్, వినయ్ సింగ్, సురేశ్, శుభమ్, సుమన్, ప్రకాశ్ తివారీ ఉన్నారు.

తెలుగు పాటకు 'ఆస్కార్' రావడం గర్వకారణం

ముగిసిన యువనిక నాటకోత్సవాలు



చంద్రబోస్‌ను సన్మానిస్తున్న వినోద్‌కుమార్

గన్‌ఫౌండ్రీ: తెలుగు పాటకు ఆస్కార్ అవార్డు రావడం ఎంతో గర్వకారణమని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వి.వినోద్‌కుమార్ అన్నారు. తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న యువనిక నాటకోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి చెందిన చంద్రబోస్‌కు ఆస్కార్ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నాటి నుంచి నేటి వరకు నాటక కళ సజీవంగా ఉందని, జీవ నాటకోత్సవాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. సినీ రచయిత చంద్రబోస్ మాట్లాడుతూ.. 90 ఏళ్ల ఆస్కార్ చరిత్రలో మొదటి అంతర్జాతీయ వేదికపై తెలుగు మాటలు అక్కడ వినిపించాయని గుర్తుచేశారు. ఆస్కార్ అవార్డు అందుకున్న సమయంలో మనదేశ సాహిత్య గౌరవాన్ని పట్టుకున్నట్లు అనిపించిందని తెలియజేశారు. అనంతరం విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కళ నేత, క్రియేటీవ్ థియేటర్స్ ఆధ్వర్యంలో అల్ప నాటికలను ప్రదర్శించారు. నాటక కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్, సంగీత నాటక అకాడమీ చైర్మన్ దీపికారెడ్డి, భాషా సాంస్కృతిక డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రియాజుల్ హసన్ హఫందీ

డబీర్‌పురా: పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని శనివారం డబీర్‌పురా దర్వాజా వద్ద మజ్లిస్ ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ హసన్ హఫందీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మజ్లిస్ పార్టీ చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ, కార్పొరేటర్లు సోహేల్ ఖాద్రీ, ముస్తాఫా, మజ్లిస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైద్య సేవా రత్న అవార్డుల ప్రదానం



రవీందర్ రాజును అవార్డుతో సత్కరిస్తున్న ప్రకాష్‌రావు

నాంపల్లి: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పబ్లిక్ హెల్త్‌కేర్ కౌన్సిల్(పీహెచ్‌సీసీ) సంస్థ నిర్వహణలో శుక్రవారం రాత్రి నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో వైద్య, అనుబంధ రంగాల్లో విశేషమైన సేవలందిస్తున్న పలువురు లబ్ధ ప్రతిష్టులకు పీహెచ్‌సీసీ వైద్య సేవా రత్న–2023 అవార్డులను ప్రదానం చేశారు. పీహెచ్‌సీసీ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ డాక్టర్ పీఎస్ సాగర్ అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా టీడబ్ల్యూఆర్‌డీఎస్ చైర్మన్ ప్రకాష్‌రావు హాజరయ్యారు. జీడిమెట్ల డివిజన్ సుచిత్రకు చెందిన యోగా నిపుణులు, ఆక్యుపంచర్ వైద్యులు రవీందర్ రాజు సత్కారం పొందారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీసీ జాతీయ అధ్యక్షులు సయ్యద్ ఇలియాస్ అహ్మద్, మల్టిపుల్ కో ఆర్డినేటర్– ఎండీ 320 తెలంగాణ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ సురభి వాణి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ప్రైవేటీకరణను వెనక్కి తీసుకోవాలి



ధర్నాలో పాల్గొన్న ఆకుల శ్రీనివాస్

చాంద్రాయణగుట్ట: కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వం గద్దె దిగేంతవరకు ఐకమత్యంతో పోరాడుతామని బీఆర్‌టీయూ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఇన్‌చార్జి ఆకుల శ్రీనివాస్ స్పష్టం చేశారు. నగరంలో జరిగిన మహాధర్నాలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సింగరేణి బొగ్గు గనులను ప్రైవేటీకరణ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం తన మొండి వైఖరిని మార్చుకోవాలన్నారు. గనుల వేలాన్ని వెంటనే ఆపాలని.. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున కార్మికులతో ఉద్యమ బాట పడుతామన్నారు.

సింగరేణి భవన్ ఎదుట ఆందోళన..

నాంపల్లి: సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ కార్మిక విభాగం నేతలు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు శనివారం రెడ్‌హిల్స్‌లోని సింగరేణి భవన్ ఎదుట కార్మిక విభాగం నేతలు ధర్నా చేపట్టారు. భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు రాంబాబు నేతృత్వంలో జరిగిన ధర్నాకు పెద్ద ఎత్తున కార్మికులు హాజరై నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. లాభాల బాటలో ఉన్న సింగరేణిని ప్రైవేటీకరణ చేయాలనడం కేంద్ర ప్రభుత్వం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ, ఉపాధ్యక్షులు వేముల మారయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న మహ్మద్ సలావుద్దీన్ లోధీ

చార్మినార్: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్‌ఎస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ అన్నారు. మొఘల్‌పురా డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి పుప్పాల రాధాకృష్ణ ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాబోయే ఎన్నికల నాటికి ఇప్పటి వరకు అమలు జరిగిన సంక్షేమ పథకాల వివరాలను ప్రజలందరికీ వివరించాల్సిన అవసరం ఉందన్నారు. పుప్పాల రాధాకృష్ణ మాట్లాడుతూ.. డివిజన్ స్థాయిలోని బూత్ లెవల్ కమిటీని మరింత పటిష్టం చేయడానికి కృషి చేస్తామన్నారు. దాదాపు 100 మందితో బూత్ కమిటీలు నియమించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఒకరినొకరు ఆలింగనం చేసుకున్న అనంతరం సమావేశం జరిగింది. సమావేశం అనంతరం సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా సీనియర్ నాయకులు పుస్తే శ్రీకాంత్‌తో పాటు నాయకులు గోపీయాదవ్, సలీం, విజయ్ కుమార్, అరుణ, నీరజ, దాస్, సోను, సునీత పాల్గొన్నారు.

అభినందనలు



విద్యార్థిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

గోల్కొండ: తాము అనుసరిస్తున్న వినూత్న బోధన పద్ధతుల వల్లే రాష్ట్ర స్థాయి పోటీల్లో విశేషంగా రాణిస్తూ ర్యాంకులు సాధిస్తున్నారని టోలిచౌకి సూర్యనగర్ కాలనీలోని రవీంద్రభారతి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శశికళ అన్నారు. పి.వి.రామానుజన్ కాంపిటీటివ్ జీనియర్ పోటీ పరీక్షల్లో పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి గీత్ హర్షిద్ హైదరాబాద్ జిల్లా స్థాయిలో 2వ ర్యాంకు సాధించాడు. శనివారం ఆ విద్యార్థికి ప్రిన్సిపాల్ శశికళ పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

గో రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

సుల్తాన్‌బజార్: గో మాతను రాష్ట్ర మాతగా ప్రకటించాలని లవ్ ఫర్ ఫౌండేషన్ ట్రస్టీ రిడేష్ జాగిర్దార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పూరి జగన్నాథ్ మందిరంలో ఫౌండేషన్ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గో రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గోమాతను రాష్ట్ర మాతగా ప్రకటించాలని ఇప్పటికే ప్రభుత్వాలకు ఎన్నో వినతులు చేసినా నేటివరకూ అమలు కాలేదన్నారు. గో మాత రక్షణ ధ్యేయంగా తమ సంస్థ పనిచేస్తుందన్నారు.



'జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహిస్తాం'



నరేష్ గోగికర్

జియాగూడ: జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని మహాత్మా జ్యోతిరావు పూలే రాష్ట్ర యువజన సంఘం కో ఆర్డినేటర్‌గా నియమితులైన నరేష్ గోగికర్ అన్నారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర ప్రభుత్వంచే ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో జరుగనున్న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలకు గాను కో ఆర్డినేటర్‌గా నియామకపత్రాన్ని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ చేతుల మీదుగా అందుకున్నారు. అనంతరం నరేష్ గోగికర్ మాట్లాడుతూ.. బీసీల అభ్యున్నతికి అన్నివిధాల కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా బెక్కం వెంకటేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

క్రమశిక్షణకు మారుపేరు మజ్లిస్ పార్టీ: ఎమ్మెల్యే కౌసర్



ఖాదర్‌బాగ్ వాసులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ క్రమశిక్షణకు మారుపేరుగల పార్టీ అని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం నానల్‌నగర్ డివిజన్‌కు చెందిన పలువురు సీనియర్ సిటిజెన్స్ ఆయనను కలిశారు. ఖాదర్‌బాగ్‌లో కొత్త డ్రైనేజీ లైన్లు రోడ్లు వేసినందుకు ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్లు మజ్లిస్ యువ కార్యకర్తలకు మార్గనిర్దేశనం వహిస్తూ వారు మరింత క్రమశిక్షణతో పార్టీ కోసం పని చేసేలా తయారు చేయాలని సూచించారు. మజ్లిస్‌లో యువ కార్యకర్తలకు పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఎన్నో బాధ్యతలు అప్పజెప్పారని ఆయన అన్నారు. వారిలోని లోపాలను గుర్తించి సీనియర్ సిటిజెన్స్ వారికి సరైన దిశానిర్దేశనం చేయాలని ఆయన సూచించారు. మజ్లిస్ ఏరియా కమిటీలకు ప్రాతినిధ్యం వహించిన వారిలో ఎందరో నేడు మజ్లిస్ ముఖ్య నేతలుగా ఎదిగారని, మరికొందరు ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యారని ఆయన అన్నారు.

రన్ ఫర్ జీసస్ ర్యాలీ విజయవంతం



ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

సుల్తాన్‌బజార్: కల్వరి సిలువలో మానవాళి పాప పరిహారం కోసం మానవ అవతార ఏసుక్రీస్తు ప్రభువు ఎత్తారని క్రైస్తవ ధర్మ ప్రచార సమితి అధ్యక్షుడు జేరుషలం మత్తయ్య అన్నారు. శనివారం అబిడ్స్‌లోని సెయింట్ జార్జియస్ చర్చి వద్ద రన్ ఫర్ జీసస్ అనే ర్యాలీని క్రైస్తవులు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జేరుసలేం మత్తయ్య మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు ప్రభువు రోమన్ పాలకుల చేతిలో చనిపోయిన రోజుగా క్రైస్తవులు గుడ్ ఫ్రైడేగా జరుపుకుంటారు. అనంతరం ఈస్టర్ రోజు ఏసు మరణం తర్వాత మూడవ రోజు పునర్జన్మించాడని, తద్వారా తిరిగి సజీవులుగా మరణం జయించారని ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవ మతస్తులు ఈస్టర్ పండుగను జరుపుకుంటారు. ఈ ర్యాలీ సికింద్రాబాద్ నుంచి అబిడ్స్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఇండిపెండెంట్ బిషప్‌లు, పాస్టర్లు, రేవా ప్రకాష్, ఉషాపాల్ పాల్గొన్నారు.

సత్కారం



నాలేశ్వరం శంకరాన్ని సత్కరిస్తున్న బడేసాబ్

నాంపల్లి: కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు భాషా సలహా మండలి సభ్యుడిగా నియమించబడిన తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నాలేశ్వరం శంకరాన్ని తెలుగు భాష చైతన్య సమితి అధ్యక్షుడు బడేసాబ్, దర్పణం సాహిత్య వేదిక ఉపాధ్యక్షులు, ప్రముఖ కవి, రామకృష్ణ చంద్రమౌళి, కవి అబ్దుల్ సాహిద్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అంబర్‌పేటలోని వారి స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు భాషా సలహా మండలిలో నాలేశ్వరం శంకరానికి చోటు దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ హవా



వినతిపత్రం సమర్పిస్తున్న కురకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: రాష్ట్రంలో కాంగ్రెస్ బలంగా ఉందని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు గెలవడం ఖాయమని కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రోహిన్‌రెడ్డి అన్నారు. డీసీసీతో పాటు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలో కూడా కార్వాన్ కాంగ్రెస్ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ శనివారం కార్వాన్ నియోజకవర్గం నాయకులు ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. కురకుల కృష్ణ మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పటిష్టమైన ఓటు బ్యాంకు ఉందన్నారు. అంతేకాకుండా మైనార్టీలు, బీసీలు మళ్లీ కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నారన్నారు. చంటిబాబు, రఘుపాల్ రెడ్డి, చంద్రశేఖర్, హమీద్, గిరి, శ్రీరాములు తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం



ఆసిఫ్‌నగర్ డివిజన్ బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న నాయకులు

విజయనగర్‌కాలనీ: మాయమాటలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్న బీజేపీని తరిమికొట్టాలని హైదరాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ శ్రావణ్ అన్నారు. శనివారం నాంపల్లి నియోజకవర్గం ఆసిఫ్‌నగర్ డివిజన్ మందులగూడలో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేష్, నాంపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జ్ సీహెచ్. ఆనంద్‌కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రావణ్ మాట్లాడుతూ.. దేశం మొత్తం బీఆర్‌ఎస్ వైపు చూస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రం, దేశంలో బీఆర్‌ఎస్ విజయ ఢంకా మ్రోగిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫ్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి శీలం బాలచందర్, సంజయ్, మురళీధర్, ప్రదీప్, ధరమ్‌సింగ్, విద్యాసాగర్, రేణేశ్వర్‌గౌడ్, నవీన్, నాగరాజు, చంద్రమౌళి, భిక్షపతి, లక్ష్మీబాయి, బాలమణి పాల్గొన్నారు.

నరేంద్ర మోదీ గో బ్యాక్ అంటూ నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎం) నాయకులు

సంతోష్‌నగర్: నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇప్పటికే ఎన్నో ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని.. ఎన్నికల కంటే ముందు ఇచ్చిన ఎన్నో హామీలను గాలికి వదిలేశారని సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ పార్టీ కార్యదర్శి ఎండీ అబ్బాస్ అన్నారు. శనివారం హైదరాబాద్ సౌత్ జిల్లా సీపీఐఎం పార్టీ ఆధ్వర్యంలో నరేంద్ర మోదీ రాకను వ్యతిరేకిస్తూ నరేంద్రమోదీ గో బ్యాక్ అంటూ బ్యానర్‌ను ప్రదర్శిస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. నల్లధనాన్ని వెలికితీసి ప్రతిఒక్కరి అకౌంట్‌లో రూ.14 లక్షలు జమ చేస్తామన్న మాటను గాలికి వదిలేశారన్నారు. నిరసనకారులను సంతోష్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి సంతోష్‌నగర్ స్టేషన్‌కు తరలించారు. ఎండీ అబ్బాస్, కోటయ్య, మీనా, బాలు నాయక్, అబ్దుల్ లతీఫ్, అన్వర్ ఖాన్, మహమ్మద్ సాహేబ్ పాల్గొన్నారు.

వరకట్న వేధింపులకు గృహిణి బలి

రాజేంద్రనగర్: అదనపు కట్నం కోసం తమ కూతురును వేధించి హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారంటూ కర్ణాటకకు చెందిన దంపతులు అత్తాపూర్ ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కూతురును చంపడంతో పాటు కేసును వాపసు తీసుకోవాలని బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ వివరాల ప్రకారం.. అత్తాపూర్‌కు చెందిన రత్నదీప్(28) వివాహం కర్ణాటక బీదర్‌కు చెందిన నందిని(24)తో రెండేళ్ల క్రితం జరిగింది. వివాహ సమయంలో 8 తులాల బంగారం, ఐదు లక్షల కట్నం ఇచ్చి ఘనంగా పెళ్లి జరిపించారు. వివాహం జరిగిన కొన్నిరోజులకే రత్నదీప్ అదనపు కట్నం కోసం భార్యను వేధించేవాడు. గత నెల రోజులుగా కొత్తగా ప్లాట్ కొనుగోలు చేస్తున్నామని డబ్బులు తీసుకురావాలంటూ రత్నదీప్‌తో పాటు అత్తా మామా విజయ, లక్ష్మణ్‌రావులు సైతం వేధించారు. ఈ నెల 6వ తేదీన రత్నదీప్ బీదర్‌లోని నందిని తల్లిదండ్రులకు ఫోన్‌చేసి నందిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందంటూ సమాచారం అందించారు. హుటాహుటిన తల్లిదండ్రులు నగరానికి చేరుకున్నారు. 7వ తేదీ ఉస్మానియా మార్చురీలో మృతదేహాన్ని పరిశీలించగా ఒంటిపై గాయాలు ఉండడంతో అదనపు కట్నం కోసమే అత్తింటి వారు వేధించి హత్య చేశారని నిర్ధారించుకుని దహన సంస్కారాలు పూర్తి చేశారు. శనివారం ఉదయం అత్తాపూర్ ఔట్‌పోస్టు పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా కేసును నమోదు చేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పఠనం

రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లి చైతన్య విల్లాస్ కాలనీ రామాలయంలో హనుమాన్ చాలీసా పఠనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెలంగాణ మాతృశ్రీ బాల సంస్కార కేంద్రం ఆధ్వర్యంలో 45 రోజుల పాటు హనుమాన్ చాలీసా పఠన కార్యక్రమాన్ని నిర్వహించారు. రామాలయంలో విగ్రహ ప్రతిష్టాపనలో ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగేలా నిర్వహిస్తున్న నిర్వహకులు తెలిపారు. శనివారం సాయంత్రం దేవాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వనితారెడ్డి, పద్మశ్రీ, కనకదుర్గా, సుభాష్, వెంకటలక్ష్మి, మంజుల, సునంద తదితరులు పాల్గొన్నారు.